సాక్షి సిద్దిపేట

శనివారం, 30, సెప్టెంబర్, 2023



అరుదైన గుర్తింపునకు అడుగులు

సీఎం కేసీఆర్‌తో పాటు ఎంతో మంది ప్రముఖులు చదివిన సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల మరో గుర్తింపు పరీక్షకు సిద్ధమైంది. వివరాలు 8లో ▸



ఆభరణాలకు పాలిష్ చేస్తామంటూ..

బంగారు, వెండి వస్తువులకు పాలిష్ చేస్తామని నమ్మించి బంగారు నగలతో ఉడాయించిన సంఘటన శుక్రవారం పెద్దశంకరంపేటలో చోటుచేసుకుంది. వివరాలు 8లో ▸



వ్యవసాయ రంగానికి పెద్దపీట

అన్నదాతల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తుందని గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అన్నారు. వివరాలు 9లో ▸



రాజశేఖర్, హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్

సాక్షి ఫోన్ ఇన్

తేదీ: 30-09-2023

సమయం: శనివారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు

అంశం:

హుస్నాబాద్ మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ, దోమల వ్యాప్తి, వ్యాధుల తీవ్రత

కాల్ చేయాల్సిన నంబర్లు:

9490977500, 9440945276

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీమ్‌కు ఎంపికైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అందుకు గాను స్కాలర్‌షిప్ పోర్టల్ ప్రారంభమైనట్లు తెలిపారు. ఈ పథకానికి ఎంపికైన 9, 10, 11, 12వ తరగతి విద్యార్థులు నవంబర్ 30 లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

ఏఆర్ ఎస్‌ఐగా పదోన్నతి



ఏఆర్ ఎస్‌ఐ స్టార్‌ను అలంకరిస్తున్న సీపీ శ్వేత

సిద్దిపేటకమాన్: ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్‌గౌడ్ ఏఆర్ ఎస్‌ఐగా పదోన్నతి పొందారు. ఈ మేరకు శుక్రవారం సీపీ కార్యాలయంలో శ్రీనివాస్‌గౌడ్‌కు ఏఆర్‌ఎస్‌ఐ స్టార్‌ను అలంకరించి అభినందించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పదోన్నతులు జీవనశైలిని మార్చే విధంగా ఉత్సాహాన్ని కలిగిస్తాయని, నూతన బాధ్యతలు పెంచుతాయన్నారు.

సెలవుల్లో పశుసంవర్ధకశాఖ జేడీ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న జగత్‌కుమార్‌రెడ్డి సెలవులపై వెళ్తున్నారు. అక్టోబర్ 3 నుంచి 23 వరకు జగత్‌కుమార్‌రెడ్డి సెలవుల్లో ఉండటంతో ఏడీగా విధులు నిర్వహిస్తున్న సత్యప్రసాద్‌రెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగించారు.

బీఆర్ఎస్‌లో సర్పంచ్ చేరిక



బీఆర్ఎస్ కండువా కప్పుతున్న ఎంపీ

దుబ్బాకరూరల్: అక్బర్‌పేట భూంపల్లి మండలం నగరం గ్రామ సర్పంచ్ ఆరుట్ల స్వరూప శ్రీనివాస్‌రెడ్డి బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం కేసీఆర్ ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలు ప్రజల హృదయాలలో నిలిచిపోతాయన్నారు. బీజేపీని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, త్వరలోనే గుణపాఠం తప్పదన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రవి, కృష్ణ, కిషన్, సురేష్, స్వామి, సిద్ధిరాములు, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

2న వైశ్య సంక్షేమ భవనం ప్రారంభం



వైశ్య సంక్షేమ సమితి భవనాన్ని పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని రంగనాయకుల గుట్ట సమీపంలో నిర్మించిన వైశ్య సంక్షేమ సమితి భవనాన్ని వచ్చే నెల 2న మంత్రి హరీశ్‌రావు ప్రారంభించనున్నట్లు మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు తెలిపారు. శుక్రవారం ఆయన భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా రాజనర్సు మాట్లాడుతూ ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మంత్రితోపాటు ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, జెడ్పీ చైర్ పర్సన్ రోజా రాధాకృష్ణ శర్మ తదితరులు హాజరుకానున్నారన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ డీసీపీ ప్రసన్నకుమార్, కౌమురవెల్లి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

మురుగును పారదోలుతాం..
దోమలను అరికడతాం

'గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాం. పట్టణంలోని 20 వార్డుల్లోనూ ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నాం. ప్రజల్లో చైతన్యం తీసుకు రావడానికి తరచూ అవగాహన కార్యక్రమాలనూ నిర్వహిస్తున్నాం' అని మున్సిపల్ కమిషనర్ విద్యాధర్ అన్నారు. శుక్రవారం నిర్వహించిన 'సాక్షి' ఫోన్ ఇన్ సందర్భంగా ఆయన మాట్లాడారు. మురుగును పారదోలి దోమల వ్యాప్తిని అరికట్టడమే లక్ష్యమని స్పష్టం చేశారు.

– గజ్వేల్/గజ్వేల్‌రూరల్

- పారిశుద్ధ్యమే లక్ష్యం
- స్వచ్ఛ పట్టణమే ముఖ్యం
- సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ
- 'సాక్షి' ఫోన్ ఇన్‌లో గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ విద్యాధర్

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన 'సాక్షి ఫోన్ ఇన్'కు భారీ స్పందన లభించింది. పట్టణంలోని 20 వార్డుల నుంచి ఫోన్‌కాల్స్ వెల్లువెత్తాయి. ఈ సందర్భంగా ఎంతో కాలంగా వేధిస్తున్న పారిశుద్ధ్య సమస్యలను ఆయా కాలనీల వాసులు మున్సిపల్ కమిషనర్ ముందు ఏకరువు పెట్టారు. ప్రతి కాల్‌కు స్పందించిన కమిషనర్ సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

మా కాలనీలో ఫాగింగ్ సక్రమంగా చేయడంలేదు. దీంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. చెత్త సేకరణలోనూ అలసత్వమే..

– మద్ది నరేందర్, 20వ వార్డు

కమిషనర్ : అన్ని కాలనీల్లో నిరంతరంగా ఫాగింగ్ జరుగుతోంది. మీ వార్డులో సమస్య ఉంటే మరోసారి పరిశీలిస్తాం. చెత్త సేకరణ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించం. తగు చర్యలు తీసుకుంటాం.

డ్రైనేజీ కాలువలు దెబ్బతిన్నాయి. మురుగు రోడ్లపై పారుతుండటంతో దుర్వాసన వస్తోంది.

– రంగారెడ్డి, లక్ష్మీప్రసన్నకాలనీ

సంగాపూర్ రోడ్డు వైపు డీసీఎంఎస్ గోదాం సమీపంలో దుర్గంధం నెలకొంది. పారిశుద్ధ్యం లోపించింది. చర్యలు తీసుకోండి.

– మల్లికార్జున్, టీచర్

కమిషనర్: సమస్య పరిష్కారంపై దృష్టి సారిస్తాం. రెండుమూడు రోజుల్లో చర్యలు తీసుకుంటాం.



'ఫోన్ ఇన్'లో మాట్లాడుతున్న గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ విద్యాధర్

కమిషనర్: మున్సిపాలిటీ పరిధిలో యూజీడీ నిర్మాణం దాదాపు పూర్తి కావస్తోంది. ఇక ముందు ఈ సమస్య ఉండదు. డ్రైనేజీ దెబ్బతింటే పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

ఫాగింగ్ నిరంతరంగా జరగడంలేదు. ఫలితంగా దోమలు వృద్ధి చెంది రోగాలు ప్రబలుతున్నాయి.

– ధన్‌రాజ్, 11వ వార్డు(బీసీ కాలనీ)

కమిషనర్: అలాంటిదేమీలేదు. అన్ని వార్డుల్లో నిరంతరంగా ఫాగింగ్ చేస్తున్నాం. అవసరమైతే మరింత పకడ్బందీగా చేపడతాం.

8వ వార్డులోని చాంబర్ల నుంచి మురుగునీరు బయటకు వస్తోంది. దీంతో దుర్గంధం వ్యాపిస్తోంది.

– నక్క రాములుగౌడ్, సంగుపల్లి.

కమిషనర్: కొన్ని కాలనీల్లో ఈ సమస్య ఉన్నది. పరిశీలించి తగు చర్యలు తీసుకుంటా.

పెంటకుప్పలు, పశువుల దొడ్ల కారణంగా దోమలు పెరుగుతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించండి.

– సాయి నాగరాజు, 16వ వార్డు.

కమిషనర్: మా సిబ్బందితో క్షేత్రస్థాయి పరిశీలన జరిపిస్తాం. ఇబ్బంది ఉందని తేలితే పెంటకుప్పలు ఇళ్లకు దూరంగా మార్చేలా చర్యలు తీసుకుంటాం.

రోడ్లన్నీ బురదమయంగా మారాయి. నడకకూ నరకంగా మారాయి. కౌన్సిలర్ పట్టించుకోవడం లేదు.

– వెంకటేష్‌చారి, ప్రజ్ఞాపూర్(అంగడిబజార్).

కమిషనర్: ఈ సమస్య మా దృష్టిలో ఉంది. పరిష్కారానికి వీలైనంత తొందరలో చర్యలు తీసుకుంటాం.

మా కాలనీలో దోమలు, పందుల బెడదతో ఇబ్బందులు పడుతున్నాం. సమస్యను పరిష్కరించండి.

– నవీన, ఎలైట్ ప్రజ్వల్ కాలనీ

కమిషనర్: మీ కాలనీలో కూడా తరచుగా ఫాగింగ్ చేయిస్తున్నాం. దీనిని మరింతగా పెంచుతాం. పందుల బెడద నివారణకు చర్యలు తీసుకుంటాం.

ఇళ్ల మధ్య నీరు నిలుస్తోంది. చెత్తబండి సరిగ్గా రావడం లేదు. ఇబ్బందులు పడుతున్నాం.

– మహిపాల్‌రెడ్డి, లక్ష్మీప్రసన్ననగర్ కాలనీ.

కమిషనర్: నేనే స్వయంగా సమస్యను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటా. చెత్తబండి వచ్చేలా చూస్తా.

మహతి ఆడిటోరియం వెనుక భాగంలో వెంచర్ల ఏర్పాటుతో డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతిని మురుగునీరు ఇళ్ల చుట్టూ చేరుతోంది. ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడంలేదు.

– రజిత, 11వ వార్డు.

కమిషనర్: ఈ సమస్య మా దృష్టిలో ఉంది. మరోసారి క్షేత్రస్థాయి పరిశీలన జరిపి చర్యలు తీసుకుంటాం.

బరి చెరువులోకి మురుగునీరు వస్తోంది. తక్షణం చర్యలు తీసుకోండి.

– దేవులపల్లి మనోహర్‌యాదవ్, ముట్రాజ్‌పల్లి

కమిషనర్: సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

యూజీడీ చాంబర్లు తక్కువ ఎత్తులో ఉండడం వల్ల ఇబ్బందులు వస్తున్నాయి. ఎవరికీ చెప్పినా పట్టించుకోవడం లేదు.

– శ్రీనివాస్, పటేల్ బజార్.

కమిషనర్ : కొన్ని కాలనీల్లో ఈ సమస్య ఉన్నమాట నిజమే. పరిష్కారానికి చర్యలు త్వరలోనే తీసుకుంటాం. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

దోమల వల్ల రోగాలు ప్రబలుతున్నాయి. ఓపెన్ ప్లాట్లలో ఉన్న పొదలు, పిచ్చిమొక్కల వల్లే దోమలు వృద్ధి చెందుతున్నాయి.

– ప్రవీణ్‌కుమార్, ముట్రాజ్‌పల్లి.

కమిషనర్: వెంటనే సిబ్బందిని పంపించి ఓపెన్ ప్లాట్లలో పొదలు, పిచ్చిమొక్కలు తొలగింపజేస్తాం. అవసరమైతే సదరు యజమానికి నోటీసులు ఇస్తాం.

ఎర్రకుంట నుంచి వరద ఇళ్లలోకి వస్తోంది. దీంతో ఇబ్బంది పడుతున్నాం. సమస్యను పరిష్కరించండి.

– శ్రావణ్, బాలాజీనగర్(6వ వార్డు).

కమిషనర్: పరిశీలన జరిపి తగు చర్యలు తీసుకుంటాం. రెండుమూడు రోజుల్లో మా సిబ్బందిని పంపిస్తా.

క్యాసారం రోడ్డుపై రేలింగ్ లేకపోవడంతో వాహనదారులు కుంటలో పడిపోయే ప్రమాదముంది. దృష్టి సారించండి.

– నీరుడి స్వామి, 1వ వార్డు.

కమిషనర్: ఈ సమస్య మా దృష్టిలో ఉంది. త్వరలోనే పరిష్కారానికి అవసరమైన కార్యాచరణ చేపడతాం.

ఇండేన్ గ్యాస్ గోదాం సమీపంలో ఇళ్ల వద్ద డ్రైనేజీ కాలువ లేదు. యూజీడీ రాలేదు. ఇబ్బందులు పడుతున్నాం.

– రమేశ్, ప్రజ్ఞాపూర్

కమిషనర్: యూజీడీ లైన్లు అవసరమున్నచోట సర్వే జరుపుతున్నాం. త్వరలోనే మీ కాలనీ వద్దకూడా సర్వే జరిపి యూజీడీ నిర్మాణం జరిగేలా చూస్తాం.

నిర్దేశిత లక్ష్యాలను అధిగమిద్దాం



స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

- ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచండి
- ఉపాధి హామీ పనులు వేగిరం చేయండి
- స్టాండింగ్ కమిటీ సమావేశాల్లో జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

సిద్దిపేటజోన్: రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించి ఆదర్శ జిల్లాగా నిలిపే బాధ్యత అన్ని శాఖలపై ఉందని జెడ్పీచైర్ పర్సన్ రోజాశర్మ అన్నారు. శుక్రవారం జెడ్పీ కార్యాలయంలో వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, శిశు సంక్షేమ, వైద్య, విద్య, ఆర్థిక ప్రణాళికల స్టాండింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల పనితీరు, నిర్దేశించిన లక్ష్యాలు, ప్రస్తుత స్థితిగతులు తదితర అంశాలపై చర్చించారు. ఆమె మాట్లాడుతూ.. రాష్టానికే జిల్లా రోల్ మోడల్ గా నిలిపే క్రమంలో మంత్రి హరీశ్‌రావు చేస్తున్న ప్రయత్నాలకు అండగా ఉందామని సూచించారు. రైతులకు ఎరువులు, అవసరమైన విత్తనాలను మార్కెట్‌లో అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఆయిల్ పామ్ సాగు లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఉపాధి హామీ పనులు వేగంగా చేపట్టాలని, అలాగే అందరికీ పని కల్పించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు, గర్భిణులకు ఇబ్బందులు తలెత్తకుండా పోషక ఆహారాన్ని అందించాలని సూచించారు. ఈ సందర్భంగా హరిత విప్లవ పితామహుడు స్వామినాథన్ మరణం పట్ల సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. సమావేశంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ రాజిరెడ్డి, సీఈఓ రమేశ్, జెడ్పీటీసీలు , జిల్లా వైద్యాధికారి కాశీనాథ్, అధికారులు పాల్గొన్నారు.

కొత్త రుణాల ప్రక్రియను వేగవంతం చేయండి



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

సిద్దిపేటరూరల్: రైతుల రుణమాఫీ ప్రక్రియ, కొత్త రుణాల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ వ్యవసాయ, బ్యాంక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో బ్యాంకు అధికారులు, వ్యవసాయ అధికారులతో అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ తో కలిసి కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న రైతు రుణమాఫీ నగదును రైతులకు అందజేసేలా చర్యలు తీసుకోవాలని బ్యాంకర్లను ఆదేశించారు. దాదాపు 21వేల మంది రైతులు క్రాప్ లోన్ రెన్యూవల్ చేసుకోవాలన్నారు. కొత్త రుణాలు తీసుకునేలా అధికారులు రైతుల్లో చైతన్యం కల్పించాలన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ మాట్లాడుతూ వీధి వ్యాపారులకు రుణాల అందజేతను వేగిరం చేయాలాన్నరు. సమావేశంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ సత్యజిత్, డీఏఓ శివప్రసాద్, డీఆర్డీఏ పీడీ జయదేవ్ ఆర్యా, ఎస్బీఐ ఆర్ఎం అరుణ్ జ్యోతి, బ్యాంకు, మెప్మా, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

నేడు సఖి సెంటర్ ప్రారంభోత్సవం

సిద్దిపేటకమాన్: సిద్దిపేట రూరల్ పోలీసుస్టేషన్ ఆవరణలో నూతనంగా నిర్మించిన సఖి సెంటర్ శాశ్వత భవనాన్ని శనివారం మంత్రి హరీశ్‌రావు ప్రారంభించనున్నారు. మహిళల సమస్యల పరిష్కారం కోసం ఈ సఖి సెంటర్ ఉపయోగపడనున్నట్లు తెలిపారు. మంత్రి హరీశ్‌రావు చొరవతో ఏర్పాటు చేసిన సఖీ సెంటర్ ద్వారా మహిళలకు అనేక రకాల సమస్యలు పరిష్కరించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



పేలిన గ్యాస్ సిలిండర్

- ధ్వంసమైన భవనం
- ప్రాణభయంతో పరుగులు తీసిన కుటుంబం
- త్రుటిలోతప్పిన పెద్ద ప్రమాదం
- దుబ్బాకలో దారుణం

దుబ్బాకటౌన్: సరిగ్గా శుక్రవారం రాత్రి 8.25 నిమిషాలు.. ఆ సమయంలో దుబ్బాక పట్టణంలోని 18 వ వార్డులో ఒక్క సారిగా పెద్దశబ్దంతో గ్యాస్ సిలిండర్ పేలింది. గ్యాస్ వాసన రావడంతో పెద్దగా అరుస్తూ కుటుంబీకులు ప్రాణభయంతో బయటకు పరుగెత్తారు.. ఆ వెంటనే సిలిండర్ పేలి బిల్డింగ్ పూర్తిగా దెబ్బతిన్నది. పేలుడు శబ్దానికి కరెంటు సరఫరా సైతం నిలిచిపోయింది. వివరాలిలా ఉన్నాయి. దుబ్బాకలోని 18 వ వార్డులో బండి శ్రీనివాస్‌గౌడ్ తన కుటుంబంతో ఉంటున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి భార్య కరుణ తన మనువరాలికి పాలు వేడి చేసేందుకు గ్యాస్ వెలిగించింది. ఆ సమయంలోనే గ్యాస్ వాసన బాగా రావడంతో బంద్ చేసేందుకు ప్రయత్నించినా సాధ్యం కాలేదు. దీంతో అప్పటికే ఇంట్లో ఉన్న శ్రీనివాస్‌గౌడ్, తన భార్యను, తన మనువరాలు హారిణిని పట్టుకొని బయటకు పరుగు తీశారు. వారు బయటకు వచ్చిన కొన్ని క్షణాల్లోనే ఒక్కసారిగా గ్యాస్ సిలండర్ పేలిపోయింది. దీంతో ఇంట్లోని వస్తువులన్నీ ధ్వంసమయ్యాయి. పేలుడు శబ్దానికి ఆ ఇంటికి సమీపంలో ఉన్న పలు ఇళ్ల గోడలకు సైతం పగుళ్లు ఏర్పడ్డాయి.



ధ్వంసమైన వస్తువులు

జనం పరుగులు..

ఒక్క సారిగా భారీ పేలుడు సంభవించడంతో పట్టణంలోని శివాలయం కాలనీలోని ప్రజలు తీవ్ర భయాందోళన గురయ్యారు. కరెంట్‌సరఫరా సైతం నిలిచిపోవడంతో దిక్కుతోచనిస్థితికి గురయ్యారు. సంఘటన తెలిసిన వెంటనే మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి అక్కడికి చేరుకొని బాధిత కుటుంబాన్ని ఓదర్చారు. అక్కడే ఉండి పరిస్థితిని సమీక్షించారు.

స్వామినాథన్ మృతి రైతులకు తీరనిలోటు



స్వామినాథన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రైతులు

హుస్నాబాద్: వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్‌కు పట్టణంలో శుక్రవారం రైతులు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా రైతు ఐక్యత సంఘం నియోజకవర్గ కన్వీనర్ రవీందర్ గౌడ్ మాట్లాడుతూ స్వామినాథన్ తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి వచ్చే విత్తనాలను రైతులకు అందించారన్నారు. గోధుమ, బంగాళదుంప, వరి విత్తనాల్లో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చారని కొనియాడారు. వివిధ పంటలకు మద్దతు ధర విషయంలో కేంద్ర ప్రభుత్వానికి అనేక ప్రతిపాదనలు ఇచ్చారన్నారు. ఆయన సేవలకు రామన్ మెగసెసే, వరల్డ్ ఫుడ్ ప్రైజ్, పద్మ భూషణ్ వంటి అవార్డులు ఎన్నో వచ్చాయన్నారు. అటువంటి గొప్ప వ్యక్తి మృతి చెందడం రైతులకు తీరనిలోటని అన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు గురాల సంజీవరెడ్డి, అయిలయ్య, లింగయ్య, లక్ష్మీనారాయణ, భూమయ్య, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక టెక్నాలజీతో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ

- నర్మెటలో 62 ఎకరాల విస్తీర్ణంలో నిర్మాణం
- 2 వేల కోట్ల లీటర్ల నీటి ట్యాంక్ ఏర్పాటు
- నేడు పనులు ప్రారంభించనున్న మంత్రులు హరీశ్‌రావు, నిరంజన్‌రెడ్డి

నంగునూరు (సిద్దిపేట): వరి, ఇతర సంప్రదాయ పంటలకు ప్రత్యామ్నాయంగా రైతులకు లాభాలు తెచ్చిపెట్టే ఆయిల్‌పామ్ సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. అలాగే యువతకు ఉపాధి కల్పించేందుకు చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలో నంగునూరు మండలం నర్మెటలో ఆయిల్‌ఫెడ్, ప్రభుత్వం సహకారంతో 62 ఎకరాల విస్తీర్ణంలో ఫ్యాక్టరీ నిర్మాణం పనులను శనివారం మంత్రి నిరంజన్‌రెడ్డితో కలిసి మంత్రి హరీశ్‌రావు ప్రారంభించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా ఆయిల్‌పామ్ పంట సాగు విస్తీర్ణం పెంచేందుకు చర్యలు చేపట్టింది. రైతులకు మంచి లాభాలు వచ్చే అవకాశం ఉండడంతో సబ్సిడీపై మొక్కలు, డ్రిప్పు అందజేసి మూడేళ్ల పాటు నిర్వహణ ఖర్చులు అందజేస్తోంది. అలాగే పంటల సస్యరక్షణ, దిగుబడి పెరిగేందుకు శాస్త్రవేత్తలు, ఆయిల్‌ఫెడ్ అధికారులు శిక్షణ ఇస్తున్నారు. పంటను ఇక్కడే అమ్ముకునేందుకు నర్మెటలో ఆయిల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. దీంతో 2022 ఏప్రిల్ 14న ఫ్యాక్టరీ నిర్మాణం కోసం మంత్రులు హరీశ్‌రావు, వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి భూమి పూజ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 11 వేల ఎకరాల్లో రైతులు ఆయిల్‌పామ్ పంటను సాగు చేశారు.



నర్మెటలో ఫ్యాక్టరీ నిర్మించనున్న స్థలం


ఫ్యాక్టరీ నిర్మాణం

రాష్ట్ర వ్యాప్తంగా రెండు ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీలు ఉండగా కొత్తగా నర్మెటలో 62 ఎకరాల భూమిని టీఎస్ఐఐసీ (తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పోరేషన్) ద్వారా సేకరించి అభివృద్ధి చేశారు. పూర్తి అధునాతన పద్ధతిలో 60 వేల టన్నుల సామర్థ్యంతో కార్మాగారాన్ని నిర్మించనున్నారు. 2 వేల కోట్ల లీటర్ల నీటి ట్యాంక్‌ను నిర్మిస్తున్నారు. అయిల్ తయారీ తరువాత వచ్చే వ్యర్థాలను కొన్ని రకాల వస్తువుల ఉత్పత్తికి వినియోగించడంతోపాటు మిగిలిన వాటిని సేంద్రియ ఎరువుగా తయారు చేస్తారు.

జిల్లా వ్యాప్తంగా మూడు నర్సరీలు

మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవ తీసుకొని మలేషియా, ఇండోనేషియా నుంచి మొక్కలు తెప్పించి జిల్లాలో చిన్నకోడూర్ మండలం రంగనాయక సాగర్, ములుగు, జగదేవ్‌పూర్ మండలం ఎల్లాయిగూడలో కలిపి మూడు నర్సరీలను ఏర్పాటు చేశారు. ఇందులో 13 వేల ఎకరాలకు సరిపడా 20 వేల మొక్కలను పెంచారు. వచ్చే నాలుగేళ్లలో 50 వేల ఎకరాల్లో ఆయిల్‌ఫామ్ సాగు చేసేలా ప్రణాళిక రూపొందించారు.


మంత్రి ప్రత్యేక చొరవ



సాంప్రదాయ పంటలు సాగు చేస్తూ అరకొర లాభాలు గడిస్తున్న రైతులను లాభాల బాట పట్టించేందుకు మంత్రి హరీశ్‌రావు ఆయిల్‌పామ్ సాగు వైపు మళ్లించారు. వారికి అండగా నిలుస్తూ నర్మెటలో ఫ్యాక్టరీ నిర్మించేందుకు కృషి చేశారు. సీఎం కేసీఆర్, మంత్రి హరీష్‌రావుకు కృతజ్ఞతలు.

– ఎర్ల సోమిరెడ్డి, ఆయిల్‌పామ్ ఫార్మర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

సంతోషంగా ఉంది



ఒకప్పుడు కరువు కాటకాలు.. బీడు భూములతో ఉన్న ఈప్రాంతం నేడు కోనసీమను తలపిస్తోంది. సీఎం కేసీఆర్ సహకారంతో నర్మెటలో అయిల్‌పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయడం సంతృప్తిగా ఉంది. ఆయిల్‌పామ్ సాగుతో జిల్లా రైతులు లాభాల బాట పట్టనున్నారు.

– హరీశ్‌రావు, మంత్రి

క్లుప్తంగా

చేపలు పట్టేందుకు వెళ్లి..

దుబ్బాక : చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన దుబ్బాక మున్సిపల్ పరిధిలోని చెల్లాపూర్‌లో జరిగింది. దుబ్బాక ఎస్ఐ గంగరాజు తెలిపిన వివరాలు. మండల పరిధిలోని బల్వంతాపూర్ గ్రామానికి చెందిన చెప్యాల కనకయ్య (55) కూలీ పనులు చేస్తుంటాడు. భార్య కళవ్వ, కొడుకు రాజు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. పిల్లలందరికీ వివాహమైంది. గురువారం సాయంత్రం చేపల వేటకని చెల్లాపూర్ సాకి చెరువుకి వెళ్లాడు. ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో గజ ఈతగాళ్లతో మృతుదేహాన్ని బయటకు తీయించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

నేరస్తుడికి రెండేళ్ల జైలు

చిన్నకోడూరు(సిద్దిపేట): ఓ వ్యక్తి మృతికి కారణమైన నేరస్తునికి రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ జిల్లా న్యాయమూర్తి డా. రఘురాం తీర్పునిచ్చినట్లు శుక్రవారం సిద్దిపేట రూరల్ సీఐ చేరాలు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని రామునిపట్లకు చెందిన బొల్లం రాంచంద్రం జూన్ 6, 2019న అదే గ్రామంలో జమీల్ కొడుకుతో గొడవ పడ్డాడు. అక్కడేఉన్న గొల్లపల్లి వెంకటేశం(47) వారిని సముదాయించబోయాడు. ఈ గొడవతో నీకు సంబంధం లేదని వెంకటేశంను రాంచంద్రం దుషిస్తూ నెట్టేశాడు. దీంతో పక్కనే ఉన్న బండరాయిపై పడటంతో వెంకటేశంకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స పొందుతూ రెండు రోజులకు మృతి చెందాడు. మృతుని తల్లి గొల్లపల్లి మల్లవ్వ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ అశోక్ కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ తదుపరి పరిశోధన పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ వేశారు. ఇరువురి వాదనలు విన్న తరువాత బొల్లం రాంచంద్రంపై నేరం రుజువు కావడంతో రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ శుక్రవారం తీర్పునిచ్చారని సీఐ తెలిపారు.

సింగూరు ప్రాజెక్టుకు వరద

పుల్‌కల్(అందోల్): సింగూరు ప్రాజెక్టుకు ఎగువనుంచి భారీగా వరద నీరు వస్తుంది. ఎగువ నుంచి 3,528 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 11వ నంబర్ క్రస్ట్ గేట్ ఎత్తి 8,194 క్యూసెక్కులు, జలవిద్యుత్ కేంద్రం జనరేటర్ ద్వారా 1460 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారని ఏఈ మహిపాల్ రెడ్డి తెలిపారు.

సమస్యలు పరిష్కరించండి



వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

సిద్దిపేటరూరల్: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు దాసరి కళావతి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు కళావతి మాట్లాడుతూ పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడంతో కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కొత్త మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని చెప్పడమే తప్ప బడ్జెట్ కేటాయించకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, బాల్ నర్సయ్య, పాల్గొన్నారు.

అరుదైన గుర్తింపునకు అడుగులు

- నాక్ గ్రేడ్ ఏ ప్లస్ ప్లస్ కోసం సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల సన్నద్ధం
- అక్టోబర్‌లో సందర్శించనున్న నాక్ బృందం
- 80 శాతం ఆన్‌లైన్ నివేదికల సమర్పణ

సిద్దిపేటఎడ్యుకేషన్: రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు ఎంతో మంది ప్రముఖులు చదివిన సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల మరో గుర్తింపు పరీక్షకు సిద్ధమైంది. మినీ యూనివర్సిటీని తలపించేలా కొనసాగుతున్న కళాశాల నాక్(ఎన్ఏఏసీ) ఏ ప్లస్ ప్లస్ సాధించేందుకు అవసరమైన అన్ని అర్హతలను సాధించింది. 2005లో బీ గ్రేడ్, 2011లో ఏ గ్రేడ్, 20017లో మరోసారి ఏ గ్రేడ్ గుర్తింపును దక్కించుకుని ఈ సారి ఏ ప్లస్‌ప్లస్ గ్రేడ్ కోసం పరీక్షకు సిద్ధమైంది. నాలుగో విడత గుర్తింపులో భాగంగా అక్టోబర్‌లో నాక్ బృందం కళాశాలను సందర్శించనున్న నేపథ్యంలో ప్రత్యేక కథనం.

మాజీ ఎమ్మెల్యే, ఎంపీలు ఎడ్ల గురువారెడ్డి, పీవీ రాజేశ్వర్‌రావుల ప్రత్యేక చొరవతో 1956లో కేవలం 30 మంది విద్యార్థులతో ప్రారంభమైన కళాశాల.. నేడు సుమారు 4500 మంది విద్యనభ్యసిస్తున్నారు. ప్రస్తుత మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, దివంగత దుబ్బాక ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, కూర రఘోత్తంరెడ్డి, ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, రాష్ట్రసాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిద్దారెడ్డి, ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి, సైంటిస్టులు సుధాకర్‌రెడ్డి, బాలకిషన్, విద్యావేత్తలు చుక్కా రామయ్య, కేవీ రాఘవాచారి, కేరళ సెంట్రల్ యూనివర్సిటీ వీసీ వెంకటేశ్వర్లుతో పాటు మరెందరో ప్రముఖులు ఈ కళాశాల పూర్వవిద్యార్థులే.

నాక్ గుర్తింపుకు అవసరమైన అంశాలు

పాఠ్యాంశ, విద్యా ప్రణాళిక కోణాలు, బోధన, శిక్షణ మూల్యాంకనం, పరిశోధన, ఆవిష్కరణలు, సామాజిక వ్యాప్తి కార్యక్రమాలు మౌలిక వసతులు, వనరుల సమకూర్పు, విద్యార్థుల పురోగతికి చేయూత, పాలన, నాయకత్వం నిర్వహణ విధానాలు, సంస్థాగత విలువలు, ఉత్తమ పద్ధతులు తదితర అంశాలను ప్రాతిపదికగా తీసుకుని నాక్ గుర్తింపు అందిస్తారు.



సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల

కళాశాల ప్రత్యేకతలు

- 126 గదులు, 53 ఆధునిక బోధన సాంకేతిక పరికరాలు కలిగిన తరగతి గదులు
- 40 ల్యాబ్‌లు, 18 డిపార్ట్‌మెంట్లు, న్యాక్, ఐక్యూఏసీ, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విభాగాలు
- మొత్తం 109మంది అధ్యాపకులు, 24 మంది నాన్‌టీచింగ్ సిబ్బంది
- 50శాతం మంది అధ్యాపకులు పీహెచ్‌డీ కలిగి ఉండడం
- అంతర్జాతీయ స్థాయిలో జర్నల్స్ ప్రచురణ
- 10 మంది అధ్యాపకులకు 12 పేటెంట్ హక్కులు
- దేశ విదేశాల్లో పరిశోధనా పత్రాల ప్రదర్శన
- ప్రతియేడు జిజ్ఞాసలో బహుమతుల సాధన
- ఆర్ట్స్‌లో రూ. 5లక్షలతో ఏర్పాటు చేసిన రీసర్చ్ సెంటర్



డిజిటల్ క్లాస్‌రూమ్

- జీవభౌతిక రసాయన శాస్త్రాలకు రూ. 25లక్షలతో సెంట్రల్ రీసర్చ్ ల్యాబ్
- రూ. 55లక్షలతో ఏర్పాటు అవుతున్న రూఫ్ టాప్ సోలార్ ఎనర్జీ సిస్టమ్.

కళాశాలలలోని కోర్సులు

- 41 డిగ్రీ ప్రోగ్రాంలు, 10 పీజీ ప్రోగ్రాంలు
- నాలుగేళ్ల బీఎస్సీ ఆనర్స్ ఇన్ కంప్యూటర్ సైన్స్ ప్రత్యేక ప్రోగ్రాం
- 35 సర్టిఫికెట్ కోర్సులు, 60 కంప్యూటర్‌లతో 55వేల పుస్తకాలతో డిజిటల్ లైబ్రరీ,
- 2లక్షల 20వేలకు పైగా ఆన్‌లైన్ జర్నల్స్, 5వేలకు పైగా రెఫరెన్స్ పుస్తకాలు
- ప్రతి డిపార్ట్‌మెంట్‌కు ఒక ప్రత్యేక లైబ్రరీ
- రీ సర్క్యులేటరీ ఆక్వా కల్చర్ సిస్టం, బటర్‌ఫ్లై గార్డెన్,
- డ్రిప్, స్ప్రింక్లర్, మల్చింగ్ పద్ధతుల నిర్వహణ
- ప్రారంభ దశలో ఫిష్ హాచరీ ట్యాంక్‌లు, ఈడీ సెల్
- టీఎస్‌కేసీ, కెరియర్ ప్లేస్‌మెంట్ సెల్స్ ద్వారా 450మందికి ఉపాధి అవకాశాల కల్పన
- ఐఐటీ బాంబే, ఐఐఐటీ హైదరాబాద్ లాంటి పేరెన్నికగన్న సంస్థలతో ఎంఓయూలు
- ప్రతియేటా 15వరకు జాతీయస్థాయి సెమినార్లు, వర్క్‌షాప్‌ల నిర్వహణ
- అధ్యాపకులచే 140 బోధనా, పాఠ్యపుస్తకాల ప్రచురణ
- విద్యార్థులచే 1000కి పైగా ప్రాజెక్టుల రూపకల్పన
- ఐదుగురు అధ్యాపకులకు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు
- మూడు విభాగాల్లో ఐఎస్ఓ సర్టిఫికెట్లు, ప్రత్యేక జిమ్, విశాలమైన మైదానం
- కేంద్ర ప్రభుత్వం అందించిన గ్రీన్ ఛాంపియన్, బీట్‌ద కోవిడ్ అవార్డులు
- ప్రతియేటా 20 నుంచి 30 మంది విద్యార్థులు ఉన్నత చదువులకై దేశవిదేశాలతో పాటు ఢిల్లీ, కేరళ, పాండిచ్చేరి, హైదరాబాద్, కశ్మీర్ సెంట్రల్ యూనివర్సిటీలో అడ్మిషన్లు సాధించడం

మొదలైన ప్రత్యేకతలతో కళాశాల కొనసాగుతుంది.

ఏ ప్లస్ ప్లస్ గ్రేడ్ సాధించడమే లక్ష్యం



ఈ సారి కళాశాలకు ఏప్లస్ ప్లస్ గ్రేడ్ సాధించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. అధ్యాపక, అధ్యాపకేతర బృందం నిబద్ధతతో పనిచేయడంతోనే గతంలో ఏ గ్రేడ్ సాధించాం. ప్రస్తుతం అదే స్ఫూర్తితో ముందుకు సాగుతున్నాం. కళాశాల అభివృద్ధికి మంత్రి హరీశ్‌రావు, పూర్వ విద్యార్థులు అందించిన సహకారం మరువలేనిది.

– డాక్టర్ సీహెచ్ ప్రసాద్, ప్రిన్సిపాల్

అన్ని నివేదికలతో సన్నద్ధం



ఏ ప్లస్ ప్లస్ గ్రేడ్ సాధించేందుకు అవసరమైన అన్ని నివేదికలను సిద్ధం చేశాం. ఇప్పటికే ప్రతి అంశంపై సమర్థవంతంగా ఆన్‌లైన్‌లో 80శాతం నివేదికలను సమర్పించాం. న్యాక్ బృందం కళాశాలను సందర్శించనున్న నేపథ్యంలో అన్ని విభాగాలను సమన్వయం చేసుకుని రిపోర్టుల ప్రదర్శన కోసం స్టాల్స్ ఏర్పాటు చేస్తాం.

– సీహెచ్ మధుసూదన్, ఎస్ఎపసీ కోఆర్డినేటర్

ఢిల్లీలో సమరయోధుల స్మారక స్తూపం

హనుమకొండ పోస్టల్ సూపరింటెండెంట్ వి.హనుమంతు

మద్దూరు(హుస్నాబాద్): ఢిల్లీలో త్వరలోనే సమరయోధుల అమరుల స్మారక స్తూపం నిర్మించనున్నట్లు హనుమకొండ పోస్టల్ సూపరింటెండెంట్ వి. హనుమంతు అన్నారు. ఆజాద్ కా అమృత్ మహోత్సవంలో భాగంగా తెలంగాణ పోరాట యోధులు, స్వాతంత్ర సమరయోధుల ఇంటి నుంచి మట్టి సేకరణ కార్యక్రమం పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టారు. శుక్రవారం మేరీ మిట్టి మేర దేశ్ కార్యక్రమంలో భాగంగా భైరన్‌పల్లి, కూటిగల్ గ్రామాలలో తెలంగాణ పోరాటయోధులు నివసించిన ఇళ్ల నుంచి మట్టిని సేకరించారు. ఈ సందర్భంగా హన్మంతు మాట్లాడుతూ.. దేశమంతటా ఇలా సేకరించిన మట్టితో ఢిల్లీలో స్వాతంత్ర్య సమరయోధుల స్తూపం నిర్మించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం అన్నారు. అమరవీరుల కుటుంబ సభ్యులు, అధికారులు రమాదేవి, హరికృష్ణ, అశోక్ కుమార్, భాస్కర్, భిక్షపతి, మల్లారెడ్డి పాల్గొన్నారు.



మట్టిని సేకరిస్తున్న పోస్టల్ శాఖ అధికారులు

ఆభరణాలకు పాలిష్ చేస్తామంటూ..

- మహిళలకు బురిడీ
- ఆరున్నర తులాల బంగారు నగలు ఎత్తుకెళ్లిన దుండగులు
- సీసీ ఫుటేజీలో నమోదు

పెద్దశంకరంపేట(మెదక్): పట్టపగలు ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో ఉన్న మహిళలను బంగారు, వెండి, రాగి వస్తువులకు పాలిషింగ్ చేస్తామని నమ్మించి బంగారు నగలతో ఉడాయించిన సంఘటన పెద్దశంకరంపేటలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తిరుమలాపూర్ కాలనీకి చెందిన బి.రూప నివాసానికి ఓ వ్యక్తి ఇన్‌షర్ట్ వేసుకుని తాను సుభిత అనే కంపెనీలో సేల్స్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తానని, తన వద్ద రూ.35కే కిలో పౌడర్‌తో బంగారు, వెండి, రాగి వస్తువులను కడగడం ద్వారా అవి మెరుస్తాయని నమ్మించాడు. ముందుగా రాగి, వెండి పట్టగొలుసులను పౌడర్‌తో కడిగాడు. తర్వాత ఇంట్లో ఉన్న రూపతో పాటు ఆమె అత్త మంగమ్మను కూడా నమ్మించి బంగారాన్ని కూడా పాలిషింగ్ చేస్తానని చెప్పాడు. దీంతో వారివద్ద ఉన్న 3 తులాల పుస్తెల తాడు, మూడున్నర తులాల చంద్రహారం, 3 మాసాల కమ్మలు తీసుకున్నాడు. ఇంట్లో గ్యాస్ స్టౌపై నీళ్ల ఉంచి అందులో కొద్దిగా పసుపు, పౌడర్‌తో పాటు ఆ నగలను వేసినట్టు నటించాడు. 15 నిమిషాల తర్వాత అందులో నుంచి తీయాలని చెప్పి బంగారంతో బయటకు వచ్చాడు. అంతకు ముందు బైక్‌తో మరో వ్యక్తిని ఇంటి వద్ద ఉంచాడు. బయటకు రాగానే ఇద్దరు కలిసి బంగారంతో పారిపోయారు. అనంతరం ఇంట్లో ఉన్న మహిళలు గిన్నె తెరిచి చూడగా అందులో బంగారం కనిపించలేదు. వెంటనే బయటకు వచ్చి వారిని చూడగా కనిపించలేదు. దొంగలు పారిపోతున్న దృశ్యాలు సీసీ కెమెరాలో కనిపించాయి. ఈ మేరకు బాధితురాలు రూప తన భర్త అనిల్‌తో కలిసి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.



సీసీ కెమెరాకు చిక్కిన అనుమానితుల ఫొటో

వేర్వేరు ఘటనల్లో ముగ్గురు ఆత్మహత్య

సెల్‌ఫోన్ పోయిందని యువకుడు..



సాదిక్(ఫైల్)

దుబ్బాకటౌన్: సెల్‌ఫోన్ పోయిందని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం దుబ్బాకలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. దుబ్బాక మండలం హసన్‌మీరాపూర్‌కు చెందిన మహ్మద్ నీయాజ్ పెద్ద కుమారుడు సాదిక్(21) గతంలో టిప్పర్ డ్రైవర్‌గా పని చేసేవాడు. ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడు. సాదిక్ తల్లిదండ్రులు ఉపాధి కోసం కర్ణాటకకు వెళ్లారు. తమ్ముడితో కలిసి కొత్తగా వచ్చిన డబుల్ బెడ్రూం ఇంట్లో ఉంటున్నాడు. శుక్రవారం సాదిక్ తన ఫోన్ పోయిందని ఇంటికి వచ్చి తమ్ముడితో చెప్పి బాధపడ్డాడు. ఫోన్‌ను వెతకడానికి తమ్ముడు వెళ్లగా సాదిక్ ఇంట్లో ఉరివేసుకొని ఆత్యహత్యకు పాల్పడ్డాడు. దీనికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో మహిళ ..

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఆర్థిక ఇబ్బందులతో ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని పీర్లపల్లి గ్రామంలో శుక్రవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నల్ల లింగం, లక్ష్మి దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఓ కొడుకు ఉన్నారు. లింగం మేకల పెంపకంతో ఉపాధి పొందుతుండగా లక్ష్మి కూలీ పనులకు వెళ్తుండేది. పెద్ద కూతురు ఇంటర్, చిన్నకూతురు 9వ తరగతి, కొడుకు 8వ తరగతి చదువుతున్నారు. కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో మనస్తాపానికి గురైన లక్ష్మి శుక్రవారం మధ్యాహ్నం మేకలకు పోసే మందును సేవించి అపస్మారకస్థితిలో పడిఉంది. గమనించిన పెద్ద కూతురు చుట్టుపక్కల వారిని పిలిచింది. వెంటనే ఆమెను 108లో గజ్వేల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ విషయంపై ఎస్ఐని వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

తాగుడుకు బానిసై...



అంజయ్య(ఫైల్)

చేర్యాల(సిద్దిపేట): తాగుడుకు బానిసైన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని కడవేర్గు గ్రామంలో వెలుగు చూసింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొయ్యడ అంజయ్య (53) కుటుంబంతో కలిసి కొద్దిరోజులుగా సిద్దిపేటలో ఉంటున్నాడు. మద్యానికి బానిస కావడంతో అంజయ్యకు లివర్ పాడైంది. ఈనెల 27న గడ్డం చేయించుకుని వస్తానని వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు వెతికినా ఆచూకీ దొరకలేదు. శుక్రవారం ఉదయం వ్యవసాయ బావి వద్ద చెట్టుకు ఉరి వేసుకుని చనిపోయి ఉన్నట్లు చూసిన ఓ వ్యక్తి సమాచారం ఇచ్చాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భాస్కర్ రెడ్డి తెలిపారు.

గొల్ల కురుమలకు పింఛన్ ఇవ్వాలి



మాట్లాడుతున్న మల్లేశం యాదవ్

దుబ్బాకరూరల్: అక్బర్‌పేట భూంపల్లి మండలం ఎస్‌బీఆర్ ఫంక్షన్ హాల్‌లో గొల్ల కురుమల సమావేశం ఏర్పాటు చేశారు. ఇందులో గొర్రెల కాపర్ల సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఉడుత మల్లేశం హాజరై మాట్లాడారు. అర్హులైన వారికి గొర్రెల కొనుగోలు కోసం వారి ఖాతాల్లో రూ.లక్షా 75వేలు వేయాలన్నారు. అదేవిధంగా 50 ఏళ్లు నిండిన ప్రతి గొర్రెలకాపరికి పింఛన్ ఇవ్వాలని కోరారు. గొర్రెలను మేపడానికి ప్రతి గ్రామంలో 20 ఎకరాల భూమిని ప్రభుత్వం కొనివ్వాలన్నారు. అక్బర్‌పేట భూంపల్లి మండలంలోని ఎస్‌బీఆర్ ఫంక్షన్ హాల్‌లో అక్టోబర్ 8న నియోజకవర్గ స్థాయి గొల్లకురుమల సభ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో యాదమల్లు, మల్లయ్య, గోపాల్, రాజు, లోకేష్, వెంకటేశం, మధు, పోచయ్య, శ్రీశైలం, రాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొట్టిన బైక్.. ఒకరు మృతి

మరొకరికి తీవ్రగాయాలు



సాయికిరణ్(ఫైల్)

గజ్వేల్‌రూరల్: రోడ్డుపై మలుపు తిరుగుతున్న లారీని బైక్ ఢీకొన్న సంఘటనలో ఓ యువకుడు మృతి చెందగా... మరొకరికి తీవ్రగాయాలైన సంఘటన పట్టణంలోని ఎన్‌టీఆర్ చౌరస్తా వద్ద శుక్రవారం జరిగింది. సీఐ జాన్‌రెడ్డి తెలిపిన వివరాలు. మండల పరిధిలోని జాలిగామ గ్రామానికి చెందిన బండి సాయికిరణ్(22) ఇంటర్ వరకు చదువుకుని సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఇదే గ్రామానికి చెందిన బండి సంతోష్ ఇంటర్ వరకు చదివి పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. ఇద్దరు కలిసి బైక్‌పై జాలిగామ నుంచి ప్రజ్ఞాపూర్ వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో గజ్వేల్‌లోని ఎన్‌టీఆర్ చౌరస్తా వద్ద సూర్యాపేట జిల్లా గుంపుల గ్రామానికి చెందిన డ్రైవర్ నగరికంటి సైదులు లారీని యూటర్న్ చేస్తుండగా సాయికిరణ్, సంతోష్‌లు వస్తున్న బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరి తలలకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్స్‌లో గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి సికింద్రాబాద్ యశోదా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సాయికిరణ్ మృతి చెందగా, సంతోష్‌కు గాంధీలో చికిత్స అందిస్తున్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ప్రమాదస్థలంలో క్షతగాత్రులు

కుక్కల దాడి నుంచి తప్పించుకోబోయి..

బస్సును ఢీకొన్న బాలుడు.. గాయాలు

చేర్యాల(సిద్దిపేట): పట్టణంలో నివసిస్తున్న సైకం శ్రీకాంత్‌రెడ్డి కుమారుడు అనిషిత్‌రెడ్డి ఆడుకుంటూ స్థానిక గాంధీ సెంటర్ వద్ద ఉన్న మా మొబైల్ షాప్‌నకు వచ్చాడు. అక్కడ ఉన్న కుక్కలు బాలుడిపై దాడి చేశాయి. భయంతో పరుగెత్తిన బాలుడు రోడ్డుపై వెళ్తున్న ఆర్టీసీ బస్సుకు తగిలి కిందపడ్డాడు. ఈ ఘటనలో బాలుడి భుజానికి గాయమైంది.



గాయపడిన బాలుడు

సడక్‌బంద్ విజయవంతం



రోడ్డుపై బైఠాయించిన జేఏసీ నాయకులు

- రెవెన్యూ డివిజన్ సాధన కోసం ఉద్యమం ఉధృతం
- జేఏసీ నాయకుల అరెస్టు

కొమురవెల్లి(సిద్దిపేట): చేర్యాల రెవిన్యూ డివిజన్ సాధన కోసం రెవిన్యూ డివిజన్ జేఏసీ పిలుపు మేరకు శుక్రవారం మర్రిముచ్చాలలో తలపెట్టిన సడక్‌బంద్ విజయవంతం అయ్యింది. ఈసందర్భంగా చేర్యాల రెవిన్యూ డివిజన్ సాధనకు ఏర్పడిన జేఏసీ పిలుపులో భాగంగా మర్రిముచ్చాలలో అఖిలపక్ష నాయకులు జనగామ–సిద్దిపేట రోడ్డు పై బైఠాయించి సడక్ బంద్ నిర్వహించారు. సుమారు గంట పాటు రాకపోకలు నిలిచాయి. పోలీసుల జోక్యంతో నిరసన కార్యక్రమాన్ని విరమించిన జేఏసీ నాయకులు మాట్లాడుతూ... చేర్యాల రెవిన్యూ డివిజన్ ఆకాంక్షను తెలంగాణ ప్రభుత్వం విస్మరిస్తే ప్రజలు బుద్ధి చెబుతారని అన్నారు. పోలీసులు జేఏసీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్‌లో ఉంచినా.. ఈ ప్రాంత ప్రజలు భయపడకుండా సడక్‌బంద్‌ను విజయవంతం చేశారని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బద్దిపడగ కృష్ణారెడ్డి, తేలు ఇస్తారి, బాల కిషన్, తాడూరి మల్లేశం, సురేందర్‌రెడ్డి, బీజేపీ నాయకులు దండ్యాల లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు నర్ర మహేందర్‌రెడ్డి, మండల ప్రధానకార్యదర్శి కృష్ణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు జంగని రవి, పుల్లం భిక్షపతి, వంగ కృష్ణారెడ్డి, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు

ముందస్తు అరెస్టులు

జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం తలపెట్టిన సడక్ బంద్‌ను నిర్వహించకుండా చేర్యాల, కొమురవెల్లి మండలాలకు సంబంధించిన జేఏసీ నాయకులను ముందస్తుగా పోలీసులు అరెస్టు చేసి కొమురవెల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం వారిని వ్యక్తిగత పూచికత్తు పై విడుదల చేశారు. అరెస్టు అయిన వారిలో ఆముదాల మల్లారెడ్డి, పుర్మ ఆగంరెడ్డి, తడక లింగం, మిట్టపల్లి నారాయణ, పబ్బోజు రాములు చారి, లింగంపల్లి కనుక రాజు, కొయ్యడ శ్రీనివాస్ కుడకాల బాలమోహన్, మేకల కృపాకర్ ఉన్నారు.

కరెంట్ షాక్‌తో ఆరు పాడిగేదెలు మృతి

- ఆగ్రహించిన గ్రామస్తులు
- విద్యుత్ సిబ్బందిపై దాడి

వెల్దుర్తి(తూప్రాన్): విద్యుత్ వైరు తెగిపడి ఆరు మూగజీవాలు మృత్యువాతపడిన ఘటన రామాయిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ప్రమాదానికి సంబంధిత అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఆగ్రహించిన గ్రామస్తులు లైన్‌మెన్, ఏఈ, ఆపరేటర్‌పై దాడి చేశారు. ఇళ్లపై నుంచి ఉన్న 11 కేవీ తీగలను తొలగించాలని పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని బాధిత కుటుంబసభ్యులు వాపోయారు. గ్రామస్తులు, బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చల్ల నర్సింలు వ్యవసాయంతో పాటు పాడిపశువుల పోషణ చేపడుతాడు. రోజూ మాదిరిగా గురువారం రాత్రి ఇంటి సమీపంలోని పశువుల పాకలో నాలుగు పాడి గేదెలతో పాటు దూడను ఉంచాడు. కొద్ది దూరంలో మంతూరి నాగులు తన జెర్సీ ఆవును కట్టి ఉంచాడు. గురువారం రాత్రి పది గంటల ప్రాంతంలో 11 కేవీకి చెందిన విద్యుత్ వైరు తెగి పశువులపై పడడంతో అవి అక్కడికక్కడే మృత్యువాతపడ్డాయి. అదేవిధంగా విద్యుత్ వైరు సింగిల్‌ఫేజ్ కేబుల్‌పై పడడంతో పలు నివాస గృహాల్లోని ఫ్యాన్లు, టీవీలు దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న వెటర్నరీ అధికారి ఫజల్ శుక్రవారం ఉదయం సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. గురువారం రాత్రి ఘటన విషయంపై సమాచారం ఇచ్చినా శుక్రవారం ఉదయం 11 గంటల వరకు విద్యుత్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకోలేదు. దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు అక్కడకు ఆలస్యంగా వచ్చిన విద్యుత్ ఏఈ, లైన్‌మెన్, ఆపరేటర్‌లపై దాడిచేశారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం సంభవించి సుమారు మూడున్నర లక్షల రూపాయల ఆస్తి నష్టం సంభవించిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు బాధిత కుటుంబసభ్యులకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. విద్యుత్ లైన్‌మెన్‌ను వెంటనే విధులనుంచి తొలగించాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని గ్రామస్తులు హెచ్చరించారు. దీంతో విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి లైన్‌మెన్‌పై చర్యలు తీసుకోవడంతో పాటు బాధిత కుటుంబానికి నష్టపరిహారం అందేలా తనవంతు కృషి చేస్తానంటూ ఏఈ హామీనివ్వడంతో గ్రామస్తులు శాంతించారు.



విద్యుదాఘాతంతో మృతిచెందిన మూగజీవాలు